www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 29 సెప్టెంబర్ 2024
5
అన్నమయ్య




జాతీయ ఉర్దూ కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : కదిరిలో ఈ నెల 29న నిర్వహించబోయే జాతీయ ఉర్దూ కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా అంజుమన్ తరక్షీ ఉర్దూ ప్రధాన కార్యదర్శి షేక్ మొహమ్మద్ హాసిం అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బయాదే ఎ ఇక్బాల్ ఖురేషి జ్ఞాపకార్థంగా జష్నె మీలాదున్నబి సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు కదిరి ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో నాతియ జాతీయ ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నారని, ఆ సంస్థ అధ్యక్షుడు మొహమ్మద్ ఇర్షాద్, కార్యదర్శి ఇర్ఫాన్ కౌసర్ అహ్వానం అందిందన్నారు. ముషాయిరాకు సయ్యద్ షామీర్ ఖాద్రి సాహెబ్ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. ముఖ్య అతిథిగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, గౌరవ అతిథిగా తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉర్దూ ఆచార్యులు సయ్యద్ అమీనుల్లాలు పాల్గొంటారన్నారు. వ్యాఖ్యతగా అరిఫ్ అమీని వ్యవహారిస్తారన్నారు. డాక్టర్ ముజఫ్ఫర్ షహమీరీ పర్యవేక్షణలో ముషాయిరా ఉంటుందని, కదిరి ఉర్దూ కవులతో పాటు హైదరాబాద్, రాయలసీమ జిల్లాల నుండి పాల్గొంటారని తెలిపారు. ఉర్దూ ఉపాధ్యాయులు, ఉర్దూ సాహితి అభిమానుల పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఆయనతో పాటు తలీఖ్, ఇమ్రాస్ అలీ ఖాన్ ఇమ్రోజ్, హౌస్ షాద్‌లకు ఆహ్వానం అందిందని తెలిపారు.

'అన్నదాత సుఖీభవ'
అందేదెప్పుడో?

- సాయం కోసం రైతుల ఎదురుచూపులు
- అయోమయంలో 2,02,608 మంది రైతులు



ప్రజాశక్తి-రాయచోటి

అన్నదాత సుఖీభవ పథకం అమలుకు మోక్షమెప్పుడో తెలియడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ రైతుభరోసా పథకానికి పేరు మార్చడం మినహా ఎటువంటి పురోగతి లేకపోవడం రైతుల్లో నిరుత్సాహం వ్యక్తమవుతోంది. అన్నమయ్య జిల్లాలో 2,02,608 మంది రైతులు ఉన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతుల ఖాతాల్లో రూ.111.53 కోట్లు రైతు భరోసా వేశారు. కొత్త ప్రభుత్వం రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్చారు. ప్రభుత్వ వెబ్ సైట్‌లోనూ మార్పులు చేశారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని 2019లోనే చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చింది. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు 'సూపర్ సిక్స్'లో ప్రకటించారు. ఈ పథకం అమలు ఎప్పుడు అమలు అవుతుందో రైతులు ఎదురు చూస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా రైతులు

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 2,02,608 మంది రైతులు ఉన్నారు. గత ప్రభు త్వంలో రూ.111.53. కోట్లు రైతు భరోసాను రైతుల ఖాతాలలో జమ చేశారు. రాయచోటి నియోజకవర్గంలో 39,630 రైతులకు గాను రూ.2, 282.47 లక్షలు, రాజంపేటలో 23,110 మంది రైతులకు గాను రూ.12 71.95 లక్షలు, రైల్వేకోడూరులో 27,262 మంది రైతులకు గాను రూ.1499. 81 లక్షలు, మదనపల్లిలో 22,544 మంది రైతులకు గాను రూ.1240.74 లక్షలు, పీలే రులో 41,832 మంది రైతులకు గాను రూ.2305.18 లక్షలు, తంబళ్లపల్లెలో 48,230 మంది రైతులకు గాను రూ.2654.57 లక్షలు జమ చేశారు.

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

రైతులకు ప్రతిఏటా రూ.20 వేలు సాయం చేస్తామన్న టిడిపి కూటమి ఎన్నికల హామీ సందిగ్ధంలో పడింది. మరో నాలుగు నెలలకు ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్ ఇచ్చిన నేపథ్యంలో ఈ పథకం అమలు ఎప్పుడు చేస్తారనేది స్పష్టత రావటం లేదు. గతంలో ఒక రైతుకు ఎన్నిక ఎన్ని ఎకరాలు ఉన్నా కూడా పట్టాదారు పాస్ ఆధారంగా రైతు భరోసా ఇచ్చేవారు. ప్రస్తుతం అది కొనసాగిస్తారా లేదా అన్నది కూడా సమాచారం లేదు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాలకు నిధుల ఖర్చు నిమిత్తం సర్కారు ఆర్డినెన్స్ ద్వారా ఆమోదం తీసుకున్నందున నవంబర్‌లోపు రైతులకు చేస్తామన్న సాయం అందే అవకాశం లేదని తెలుస్తోంది. పోనీ పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాకనైనా ఈ ఏడాదిలో రైతులకు సాయం చేస్తారా లేదా అనే సందేహాలు మొదలయ్యాయి. ఆర్థిక సమస్యలతో ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో బయటా తాము హామీలు ఇచ్చామని కానీ, ఖజానాలో నిధులు లేవని పదేపదే ప్రస్తావిస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే అన్న దాతలకు సాయం ఇప్పుడప్పుడే కాదని అర్థమవుతోందని పలువురు చర్చ జరుగుతోంది. ఖరీఫ్ సీజన్ కూడా మధ్యలోకొచ్చింది. సెప్టెంబర్ నెలాఖరుతో పంటల సాగుకు సమయం కూడా ముగుస్తుంది. వర్షాలు లేక వేసిన పంటలు కూడా కొన్ని ప్రాంతాలలో ఎండి పోతు న్నాయి. కనీసం వేసిన పంటలకు నష్టపరిహారంపై (ఇన్‌పుట్ సబ్సిడీ) ఇంకా ప్రభుత్వంలో కదలికలు కూడా లేదు. రబీ పంటల బీమా క్లెయిములు పెండింగ్‌లో ఉన్నాయి. పంట రుణాలపై 'సున్నా వడ్డీ' రీయింబర్స్‌మెంట్ అలాగే ఉంది. బ్యాంకులు రైతులకు రుణాలివ్వట్లేదు. కౌలు రైతులకైతే ఆ వసతులు అసలే లేవు. రైతులు ఖరీఫ్ పెట్టుబడులకు ప్రభుత్వం అందిస్తామన్న సాయం రూ.20 వేల కోసం రైతులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

తక్షణం సాయమందించాలి



స కాలంలో పెట్టుబడి సహాయాన్ని అంది ంచాలి. ఏడాదిలో వర్షాలు కూడా సరిగ్గా కురవలేదు. వ్యవ సాయ కూలీలు పెరిగిపోయాయి ప్రభుత్వం స్పందించి అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలి.

- సుబ్బారెడ్డి, రైతు, రాయచోటి.

సమయం పడుతుంది



రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైంది. రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్చారు. ఇంకా ప్రభుత్వం నుండి ఆదేశాలు రాలేదు. రైతుల ఖాతాలలో అమౌంట్ వేయడానికి ఇంకా సమయం పడుతుంది.

- బి.చంద్ర నాయక్, జిల్లా వ్యవసాయాధికారి, రాయచోటి.

భూముల పరిశీలన వంద శాతం పూర్తి చేయాలి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఇంకను మిగిలి ఉన్న ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల పరిశీలనను ఈ నెలాఖరులోగా వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తహశీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ పరిశీలన, అసైన్మెంట్ భూముల ఫ్రీహోల్డ్ పరిశీలన, రెవెన్యూ శాఖకు సంబంధించి పిజిఆర్ఎస్‌లో భూమి సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలలో కలెక్టర్ సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ అయిన భూముల పరిశీలన ప్రక్రియను సజావుగా సాగేందుకు జిఒ 596 నందు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసిందిన్నారు. రీ వెరిఫికేషన్ ప్రక్రియను చట్టబద్ధంగా నిబంధనల మేరకు పక్కాగా చేయాలిన్నారు. ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వవద్దునారు. చెక్ లిస్ట్ ప్రకారం ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించాలిన్నారు. పరిశీలన ప్రక్రియలో పారదర్శకంగా ఉండాలిన్నారు. చట్ట నిబంధనలకు లోబడి పక్కగా పరిశీలన పూర్తి చేసి నిర్దేశిత నమూనాలో పూర్తి స్థాయి నివేదికలు సమర్పించాలిన్నారు. పరిశీలన ప్రక్రియలో ఎవ్వరి ఒత్తిడికి లోనుకారాదున్నారు. నివేదికకు సంబంధించిన ప్రతి ఫైలుకు అవసరమైన డాక్యుమెంట్స్ అన్నింటినీ జత చేయాలిన్నారు. జిల్లా వ్యాప్తంగా అసైన్మెంట్ భూముల పరిశీలన కూడా పూర్తిచేసి అక్టోబర్ 20లోగా సంపూర్తి నివేదికలు సమర్పించాలిన్నారు. అప్పగించిన విధులలో ఎవ్వరు అశ్రద్ధ చూపవద్దన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్ర స్థాయిలో వీఆర్వోల పరిశీలనను తహశీల్దార్లు స్వయంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఎవరైనా తప్పు దోవ పట్టించాలని చూస్తే శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని, ఎవర్ని ఉపేక్షించే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి పిజిఆర్ఎస్‌లో భూమి సమస్యలపై వచ్చిన దర ఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన ఆర్ఒఆర్, భూసేకరణ, సెక్షన్ 22ఎ, భూ ఆక్రమణ చట్టం, హౌసింగ్ అసైన్మెంట్, అసైన్మెంట్ భూముల ఫ్రీహోల్డ్ భూముల అంశాలలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవ నివేదికలతో పారదర్శకంగా దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆయా మండలాలలో ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల పరిశీలన, అసైన్మెంట్ భూముల ఫ్రీహోల్డ్ అంశాలలో పరిశీలించాల్సిన భూములు ఎన్ని, ఎంత మేర పరిశీలించి ఇంకెంత శాతం పరిశీలించాల్సి ఉందిన్నారు. పెండింగ్ ఉండడానికి గల కారణాలు, ఇప్పటివరకు పరిశీలన పూర్తి చేసిన వాటిలో ఆమోదించినవి ఎన్ని, తిరస్కరించినవి ఎన్ని తదితరాలలో తహశీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమోదించడం లేదా తిరస్కరించడం సహేతుకంగా ఉందా లేదా అని స్పష్టమైన అన్ని ధ్రువపత్రాలు జతచేసి నివేదిక సమర్పించాలని, శ్రద్ధతో బాధ్యతాయుతంగా పరిశీలన పూర్తి చేసి నిర్దిష్ట గడువు లోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డిఆర్ఒ సత్యనారాయణరావు ఆర్‌డిఒ రంగస్వామి, తహశీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

4 నుంచి ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాయచోటి

అక్టోబర్ 4 నుండి 6 వరకు మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు గుంటూరులో నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, ఎస్. జాబీర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటియఫ్ సంఘం స్థాపించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడలో డిసెంబర్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో ఉపాధ్యాయులకు వివిధ అంశాలలో క్రీడా పోటీలు నిర్వహించి వారిలో పని ఒత్తిడి నుంచి ఉత్సాహ ఫలితమైన వాతావరణంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాస్థాయి ఆటల పోటీలు 29న రాయచోటిలో నేతాజీ సర్కిల్ వద్దగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలైన వారికి రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు అక్టోబర్ 4 నుండి 6 వరకు మూడు రోజుల పాటు దసరా సెలవుల్లో గుంటూరులో నిర్వహించాలని రాష్ట్ర సంఘం నిర్ణయించిందన్నారు. క్రీడల్లో ఆసక్తి కలిగిన అన్నమయ్య జిల్లాలోని ఉపాధ్యాయులు యుటిఎఫ్ మండల శాఖల ద్వారా జిల్లా స్థాయి ఆటల పోటీలలో పాల్గొని జయప్రదంగా నిర్వహించడానికి సహకరించవలసిందిగా కోరారు. క్రీడాంశాలకు సంబంధించి పురుషులకు క్రికెట్, చెస్, షటిల్, బ్యాడ్మింటన్ (సింగిల్స్ , డబుల్స్), క్యారమ్స్ 100 మీటర్ల రన్నింగ్, 400 మీటర్ల వాకింగ్, షాట్‌పుట్, మహిళలకు టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్, 100 మీటర్ల రన్నింగ్, 400 మీటర్ల వాకింగ్, షాట్‌పుట్ నిర్వహిస్తామన్నారు. పై క్రీడాంశాలు పురుషులకు, మహిళలకు వేర్వేరుగా నిర్వహిస్తారన్నారు. ఈ పోటీలలో పాల్గొనేవారు రెగ్యులర్ ఉపాధ్యాయులై ఉండాలన్నారు. ప్రభుత్వ రంగ విద్యా సంస్థలలో పనిచేసే ఉపాధ్యాయులై ఉండాలని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని తేడా పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దావుద్దీన్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్ర రెడ్డి, అనిల్, చంద్రశేఖర్ రెడ్డి, సహాధ్యక్షులు కిఫాయత్, హఫీజుల్లా,రాజా రమేష్, సహాధ్యక్షులు రెడ్డి, బసవ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

పారదర్శకంగా ఓటర్ల జాబితా : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పారదర్శకంగా ఓటర్ల జాబితా ఉండాలన్న లక్ష్యంతో అన్ని రాజకీయ పార్టీల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ తెలిపారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఓటర్ల జాబితా ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి నియోజకవర్గంలో 2,66,800 ఓటర్లు ఉన్నారని, వీరిలో 2,66,208 మందిని సర్వే చేశామని తెలిపారు. మిగిలిన వారు అందుబాటులో లేకపోవడంతో వారి వివరాలు సేకరించలేకపోయామని పేర్కొన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాలను మార్చాల్సిన అవసరం ఉందని, వాటిలో 37, 72 బూతులు ఉన్నట్లు తెలిపారు. 1500 ఓటర్లకు పైబడి ఉన్న పోలింగ్ బూత్‌ను రెండు బూత్‌లుగా చేస్తామన్నారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెన్సీ ఏర్పాటు చేసుకొని, బిఎల్ఒలతో సమన్వయం చేసుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకోవాలన్నారు. డబుల్ ఎంట్రీ ఉన్న ఓట్లు, ఒకే ఇంటి నెంబర్‌తో ఉన్న బోగస్ ఓటర్లు, స్థానికేతర ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను గుర్తించాలని తెలిపారు. బోగస్ ఓట్లను తొలగించేందుకు వీలు ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్ర కాలనీలో నాలుగు పోలింగ్ బూతులు ఉన్నాయని అయితే అక్కడ ఉన్నవారికి స్థానికంగా ఉన్న పోలింగ్ బూత్‌లో కాకుండా మరో ప్రాంతంలో ఓటు ఉండడం, వేరే ప్రాంతాల్లో ఉన్న వారికి చంద్రాకాలనీ లోని పోలింగ్ బూతులో ఓటు ఉండడంతో ఇక్కడి వారు అక్కడికి పోలేక, అక్కడి వారు ఇక్కడికి రాలేక చిక్కులు వస్తున్నాయన్నారు. పోలింగ్ శాతం కూడా తగ్గతోందని ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. నివాస ప్రాంతాల్లో ఉన్న వారికి ఆ ప్రాంతంలోనే పోలింగ్ బూతు కేటాయిస్తే ఓటర్లకు అనుకూలంగా ఉండడంతో పాటు ఓటు శాతంకూడా పెరుగుతుందని సూచించారు. స్పందించిన సబ్ కలెక్టర్ ఈ విషయాన్ని పరిశీలించి తగు పరిష్కారం చేద్దామన్నారు. ఓటర్లు సైతం చిరునామా మారే క్రమంలో బిఎల్ఒలను సంప్రదించి ఓటరు కార్డులో మారిన అడ్రస్‌ను చేర్చుకుంటే వారికి ప్రాంతంలోనే ఓటు హక్కు కల్పించే విధంగా జాబితాలో మార్పులు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో టిడిపి, సిపిఎం, కాంగ్రెస్, జనసేన, బిజెపి, సిపిఐ నాయకులు బాలుస్వామి, శ్రీనివాసులు, రెడ్డి సాహెబ్, జంగాల శివరామ్, భగవాన్, మురళి, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండల తహశీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

గుర్రం జాషువా గొప్ప సాహితీమూర్తి



రాజంపేట : జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : నాటి సమాజంలో కులం కారణంగా అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని తన కలాన్ని ఎక్కుపెట్టి రచనలు చేసి ప్రజలలో మార్పుకై కృషిచేసిన కవి కోకిల గుర్రం జాషువా అని తెలుగు భాషా సంరక్షణ సమితి నాయకులు కాకర్ల రాముడు, గంగనపల్లి వెంకటరమణ, బొట్టా రామచంద్రయ్య నాయుడులు పేర్కొన్నారు. గుర్రం జాషువా 129వ జయంతిని పురస్కరించుకొని స్థానిక జవులీ బజారులోని సరస్వతీ విద్యా మందిరంలో తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజికపరంగా నాడు గుర్రం జాషువా చిన్నచూపు చూడబడినా నేడు ఆయన రచనలు తెలుగు సాహితీ వినీలాకాశంలో చిరస్థాయిగా నిలిచిపోయే రచనలు చేసి ప్రజల పరివర్తనకు దోహదం చేశాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసుల నాయుడు, విద్యా మందిరం ఉపాధ్యాయులు దయాకర్, పుష్పలత, శ్రావణి, కళ్యాణి, మౌనిక, పావని, మస్తానీ, సబియా పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ అభ్యుదయ భావాలను సమాజంలో పెంచే దిశగా ఆయన రచనలు చేశారన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వెంకటపతి మాట్లాడుతూ తెలుగు వారు గర్వించదగిన కవి గుర్రం జాషువా అని కీర్తించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ తాళంబెడు సాయి శంకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి సేగు రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

నిరసనాగ్రహం
ప్రజా'దృష్టి'

జిల్లాలో కూటమి సర్కారు తీరుపై సర్వత్రా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వైసిపి సర్కారు హయాంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని కడప, విశాఖపట్నం జిల్లాలకు ఎంఎస్ఎంఇ టెక్నాలజీ పార్కులను కేటాయించింది. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ యువతకు నైపుణ్యాలను పెంచాలనే ఉద్దేశంతో ఎంఎస్ఎంఇ టెక్నాలజీ పార్కులను కేటాయించింది. వైసిపి సర్కారు జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామికవాడలో ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేసింది. 19.5 ఎకరాలను కేటాయించింది. కూటమి సర్కారు కొప్పర్తి ఎంఎస్ఎంఇ టెక్నాలజీ పార్కును సిఆర్‌డిఎకు తరలిస్తూ జిఒ జారీ చేయడంపై విమర్శల వర్షం కురుస్తోంది. జిల్లాలోని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, విద్యావంతులు, నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కుటుంబంపై ఉన్న స్పర్థతో ఎటువంటి అభివృద్ధి పనులు చేయడం లేదనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. ఆయన మాటలు, చేతలను గమనిస్తే స్పష్టమవుతోందనే విమర్శలు ఉన్నాయి. కడప జిల్లాకు కొత్త ప్రాజెక్టులు ఇవ్వడం ఎవరికి ఎరుక, ఉన్న ప్రాజెక్టులను తన్నుకుపోవడం ఏవిధమైన రాజకీయమో ఆలోచించుకోవాలి. వివక్షా పూరిత వైఖరి ప్రజాస్వామ్యంలో మనజాలదనే సంగతిని గ్రహించాలి. సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లా పర్యటనల సందర్భంగా కడప జిల్లాలో టిడిపికి ఒక్క ఎమ్మెల్యేను మాత్రమే గెలిపించారని పదేపదే ప్రస్తావన చేయడం తెలిసిందే. వివక్షా పూరిత రాజకీయాల కారణంగానే ఇటువంటి ఫలితాలు వచ్చా యనే సంగతిని తెలిసి నటిస్తున్నారో, లేక జిల్లా ప్రజలను ఉద్దేశపూర్వకంగా మోసగించే నాటకం ఆడుతున్నారో తెలియడం లేదు. కులాలకు అతీతంగా ఆలోచన చేసి ఓటేయాలని పలుమార్లు అభ్యర్థించిన సంగతి తెలిసిందే. వివక్షా పూరిత రాజకీయాలే కారణమని గ్రహించాలి. లేనిపక్షంలో గత ఎన్నికల్లో లభించిన ఆ ఒక్క అసెంబ్లీ సీటు కూడా లభించని దుస్థితి దాపురించే అవకాశం ఉంది. రాష్ట్ర రాజధానిపై మీకు ప్రేమ ఉంటే కొత్త ప్రాజెక్టులు తెచ్చుకుని అభివృద్ధి పరచాలి. అటువంటి ప్రయత్నం చేయకుండా ఇతర ప్రాంతాలకు, వెనుకబడిన ప్రాంతాలనే సంగతిని మరిచిపోయి. వాటికి కేటాయించిన ప్రాజెక్టులను తరలిస్తామనడం ఎంత వరకు సబబో ఆలోచించాలి. జిల్లాలోని టిడిపి, జనసేన, బిజెపి ఎమ్మెల్యేలు సైతం ఎంఎస్ఎంఇ తరలింపును నిలువరించాలి. లేకపోతే ఇంతటితోనే రాజకీయ జీవితాన్ని మర్చిపోవాల్సి వస్తుందనే సంగతి గ్రహించాల్సిన అవసరం ఉంది. అసలే వెనుకబడిన జిల్లా. ఇటువంటి వెనుకబడిన జిల్లా నుంచి గతంలో కేంద్రం ఇచ్చిన ఎంఎస్ఎంఇ టెక్నాలజీ పార్కును తరలించాలనుకోవడం అవివేకమని గుర్తించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

'ఆదిత్య'లో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా శనివారం ఫ్రెషర్ డే వేడుకలను నిర్వహించామని డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ వి.రవి కిరణ్ సైంటిస్ట్ డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పిల్లల్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సామాజిక పరిస్థితులు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని, వివిధ రకాల ఉపాధి అవకాశాల గురించి విశదీకరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి నూతన విద్యార్థులకు స్వాగతం పలికి కళాశాలలో ఉన్న సదుపాయాలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎం.నాగమల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ ఎం.రామ్మోహన్‌రెడ్డి, ఆర్.రవీంద్రనాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకుల అభ్యున్నతికి ప్రభుత్వాలు సహకరించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఐదేళ్ళకొకసారి ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చోటు కల్పించడంలో మాత్రం ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని వాల్మీకి మహాసేన వర్కింగ్ ప్రెసిడెంట్ హరికృష్ణ విమర్శించారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమర మాట్లాడుతూ యావత్ భారతదేశంలో వాల్మీకులను ఎస్టీ, ఎస్సీలుగా గుర్తింపు ఇచ్చి ప్రభుత్వ సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో రాజకీయ లబ్ధి కోసం పాలకులు వాల్మీ కులను విభజించి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని పోరా టాలు చేసిన పాలకులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సత్యపాల్ కమిటీ ద్వారా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఇచ్చిన హామికి కట్టుబడి ఎలాంటి నిబంధనలు లేకుండా ఎస్టీ జాబితాలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధికి దూరంగా ఉన్న వాల్మీకుల సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. వృత్తి పరంగా ఎలాంటి ఆధారం లేక తీవ్ర ఇబ్బందులలో వున్న వాల్మీకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు సుదర్శన్ బాబు, వాల్మీకి నాయకులు బొగ్గిటి కృష్ణమూర్తి, వేణుగోపాల్, రామాచార్లపల్లి విజయ్, చిప్పిలి చెంద్రాయప్ప, జిల్లా నాయకులు రవి, శీనాలు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ అండర్-17 జట్టుకు బాలబాలికలు ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్ అండర్-17 బాలబాలికల ఎంపికలు మదనపల్లి బిటి కళాశాల మైదానంలో శనివారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన 16 మంది బాలికలు, 26 మంది బాలుర విద్యార్థులను ఎంపిక చేశామని స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. వీరు త్వరలో రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజ, క్రీడా భారతి అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్, నరేష్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు అజీమ్, శివ, భద్రయ్య, పార్థ సారథి, కిరణ్, రెడ్డి ప్రసాద్, క్రిస్టీ, రియాజ్ పాల్గొన్నారు. **ఎంపికైన బాలికలు :** గ్రీష్మ, ప్రణతి, హర్షిత, లక్ష్మి, సుప్రియ, భావన, ఫర్హాన, రెడ్డి, రాణి, దివ్య, తన్మయ, హేమశ్రీ, సమీరా, మహేశ్వరి, ఇందు, హేమనందిని, భావన, స్టాండ్ బైలుగా మంజుల, పద్మజ, నిత్య, సౌమ్య, దీప్తిలు ఎంపికయ్యారు. **బాలుర జట్టు :** నవీన్ కుమార్, తంగరాజు, యోగేశ్వర్, షారూక్ ఖాన్, రంజిత్, త్రివిక్రమ్, తేజసాయి రెడ్డి, సమీర్, అనీష్ అండ్రస్, జీవన్ కుమార్, పార్థివ్ సాయి, రాకేష్, జ్యోతి ప్రకాష్, రెడ్డి ప్రసాద్, జితేంద్ర, కుషి స్టాండ్ బైలుగా సుబ్రమణ్యం, గౌతం, మున్నా ఖాన్ ఎంపికైయ్యారు.

నెలవారీ ఉద్యోగోన్నతులు చేపట్టాలి

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి) : స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా, జూనియర్ లెక్చరర్‌లుగా, ఎస్‌టిజిలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఇచ్చే నెలవారీ ఉద్యోగోన్నతలు వెంటనే చేపట్టాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాస్ రాజు డిమాండ్ చేశారు. శనివారం నోబుల్ టీచర్ అసోసియేషన్ సభ్యత్వ నమోదులో భాగంగా సంబేపల్లి మండలంలోని పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ కొత్త పిఆర్‌సి అమలులోకి వచ్చేంతవరకు ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొత్త పిఆర్‌సి కోసం కమిటీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దిలీప్ కుమార్, నోబుల్ టీచర్ అసోసియేషన్ నాయకులు నల్లమల్ల రామాంజలు, రెడ్డన్న, ఓబుల్ రెడ్డి, కులశేఖర్‌రెడ్డి, నాగేశ్వర, రెడ్డయ్య రాజు, మధుసూదన్ రెడ్డి, పేరయ్య, రామయ్య, రామానాయుడు, రాజేంద్ర నాయుడు పాల్గొన్నారు.

సర్వీసు రూల్స్ అమలు చేయాలి

ప్రజాశక్తి- రాయచోటి

ఆదర్శ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్, ఎపి ఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ ఫెడరేషన్‌తో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, రాయచోటి మండలాలను సందర్శించారు. సందర్భంగా వారు ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులచే సభ్యత్వ నమోదు నమోదు కార్యక్రమం నిర్వహించడంతో పాటు మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను విస్తృతంగా చర్చించి వాటి పరిష్కారం కోసం తగిన ప్రతిపాదనలు ఉపాధ్యాయుల నుంచి ఆహ్వానించారని చెప్పారు. ఉపాధ్యాయులు అడిగిన సమస్యలపై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 24 ఉంది మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు కరోనా సమయంలో, వివిధ పరిస్థితుల్లో అనారోగ్యంతో మరణించారని, వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక ప్రక్రియలో కచ్చితంగా న్యాయం జరిగేలాగా చూడాలని పేర్కొన్నారు. కారుణ్య నియామక ప్రక్రియను చేపట్టే వరకు నిర్విరామంగా పోరాటం చేసి సాధిస్తామని తెలియజేశారు. మోడల్ స్కూల్స్ సర్వీస్ రూల్స్ వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. హెల్త్ కార్డులు వీలైనంత త్వరగా తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. గత బదిలీల సందర్భంగా కొంతమంది ఆదర్శ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగినట్లు తమ దృష్టికి తీసుకొచ్చారని, భవిష్యత్తులో బదిలీలు పారదర్శకంగా జరిగేటట్లు ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎంఎస్ టిఎఫ్ నాయకులు జి.సాదిక్ అలీఖాన్, యుటిఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా పూర్వ గౌరవాధ్యక్షులు రాధాకృష్ణ, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మిట్స్' ప్రొఫెసర్ కిరణ్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లి : మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్-డేటా సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎం.కిరణ్ కుమార్‌కు వెల్లూరులోని వెల్లూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి పిహెచ్‌డి పట్టా లభించింది. ఆటోమేటెడ్‌లూంగ్ నోబుల్ క్లాసిఫికేషన్ త్రో డీప్ లెర్నింగ్ అప్రోచెస్ విత్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్‌పై అక్కడే పనిచేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ ఆంథోనిరాజ్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనను గాను డాక్టరేట్‌ను అందించారు. కిరణ్ కుమార్‌ను కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ కుసుమ, తదితరులు అభినందనలు తెలియజేశారు.



అక్రమ కట్టడాలను తొలగింపజేస్తున్న పోలీసులు

అక్రమ కట్టడాలు కూల్చివేత

ప్రజాశక్తి-కలకడ

అక్రమ కట్టడాలను కూల్చివేసినట్లు కలకడ సిఐ గురునాథ తెలిపారు. మండల కేంద్రమైన కలకడ పోలీసు స్టేషన్ ఆవరణలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను ఎస్పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు కూల్చివేస్తున్నట్లు తెలిపారు. పోలీసు స్టేషన్ వెనకవైపు ఉన్న పరిసర ప్రాంతాలలో స్థానికులు అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపట్టడం గుర్తించిన రెవెన్యూ అధికారులు సర్వేయర్లతో సర్వే చేయించి ఈ భూమి పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్నదని నిర్ధారించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణాలు సరి కాదని, గతంలో ఎన్నో పర్యాయాలు నోటీసులు జారీ చేసినప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడంలేదని తెలిపారు. ఎస్పి తనిఖీల్లో భాగంగా స్టేషన్ ఆవరణ ప్రాంతాన్ని గుర్తించి అక్రమ కట్టడాలను నిర్మూలించాలని ఆదేశించినట్లు తెలిపారు. స్థానిక పీలేరు, కలికిరి, కలకడ, గుర్రంకొండ, కె.వి.పల్లి, వాల్మీకిపురం మండలాలకు చెందిన సిబ్బంది సమక్షంలో అక్రమ కట్టడాలను కూల్చివేసినట్లు తెలిపారు. ఇంత జరిగే ప్రాంతం నుంచి నూతనంగా నిర్మించిన మసీదుకు దారి లేదని స్థానిక ముస్లిం మైనార్టీ సోదరులు సిఐకి విన్నవించుకోవడంతో అటువైపు ఉన్న కాలువను పూడ్చివేసి దారి ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్టేషన్ పరిధిలో వచ్చే స్థలాన్ని పూర్తిగా సరిహద్దులు ఏర్పాటు చేసి ముళ్లకంచె ఏర్పాటుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. అక్రమ కట్టడాలను కూల్చడం వలన నివాసం కోల్పోయిన వారికి తక్షణమే ప్రభుత్వానికి తెలియజేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. పూర్తిగా అక్రమ కట్టడాలను తొలగించి ముళ్లకంచెని ఏర్పాటు చేయడంపై ఎస్పి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీలేరు, కలికిరి, వాయల్పాడు, సిఐలు యుగంధర్, రెడ్డి శేఖర్‌రెడ్డి, ప్రసాద్‌బాబు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది హోంగార్డులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

ప్రజాశక్తి-సుండుపల్లి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంఇఒ రవీంద్రనాయక్ తెలిపారు. మండలంలోని బి.సుండుపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం బాల్య వివాహాలు, బాలల లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహం చేయడం వలన, వారు అనారోగ్యం బారిన పడతారని, గృహహింసకు గురి అవుతారని అన్నారు. చిన్న వయస్సులో గర్భందాల్చి రక్తహీనతకు గురి కావడం, శిశు మరణాలు ఎక్కువ జరుగుతాయని అన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయన్న మాట్లాడుతూ విద్యార్థులు బాల్య దశలో మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, తమ తోటి విద్యార్థుల పట్ల స్నేహ భావం కలిగి ఉండాలని అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రవీంద్ర, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి రూ.10 వేలు విరాళం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పాపిరెడ్డిపల్లె గ్రామ పరిధిలో ఉన్న జీవనజ్యోతి ఆనంద నిలయానికి కువైట్ ఎంఆర్‌పిఎస్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిత్య అన్నదాన ఆశ్రమం వృద్ధులు, వివిధ ప్రతిభావంతులు, బాలబాలికల ఆకలి తీర్చుటకు నిత్యవసర సరుకుల కొరకు పదివేల రూపాయలు విరాళంగా అందించి మానవత్వం చాటుకున్నారు. ఒక విద్యార్థికి విద్యా సామగ్రి కొరకు కొంత నగదు అదనంగా అందించారు. ఆశ్రమ నిర్వాహకులు ఎంఆర్‌పిఎస్ నాయకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సేవా సంఘం వ్యవస్థాపకులు వెలకచర్ల రాజయ్య, అధ్యక్షులు రాగిపాటి చిన్నయ్య, ఉపాధ్యక్షులు రెడ్డిపాక సుబ్రమణ్యం, గాలిపల్లి సుబ్బరాయుడు, ఎంఆర్‌పిఎస్ సేవా సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఐగా వీరాంజనేయులు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల తహశీల్దార్ కార్యాలయం ఆర్ఐగా వీరాంజనేయులు శనివారం బాధ్యతలు చేపట్టారు. ములకలచెరువు ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న వీరాంజనేయులు బదిలీల ప్రక్రియలో భాగంగా బి.కొత్తకోట మండలం ఆర్ఐగా వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ బాలాజీ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వీరాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తహశీల్దార్ ఇతర సిబ్బంది సహకారంతో ముందుకెళ్తానని స్పష్టం చేశారు. ఆర్ఐకి తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది శుభ కాంక్షలు తెలిపారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కలకడ

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వై.యశోదరాణి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రకోటపల్లి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ నెలసరి నివేదిక సమావేశాలకు ఎంపిహెచ్‌ఇఒ జి.జయరామయ్య, హెల్త్ సూపర్‌వైజర్ బి.రెడ్డమ్మ ఆరోగ్య కార్యకర్త ఎం.వాణి పాల్గొన్నారు. ఎంపిపి కార్యాలయంలో పురిటికందెల డేటాను పూరించాలని ఆరు నెలలకు ఒకసారి వచ్చే ఎన్‌డిడి ప్రోగ్రాం విజయవంతం చేసినట్లు వారికి తెలిపారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు ఎం.రెడ్డమ్మ, అంజనమ్మ, స్నేహలత రెడ్డి, భారతమ్మ, డి.లక్ష్మి పాల్గొన్నారు. **పీలేరు:** రక్తహీనత సమస్య నిర్మూలనకు పౌష్టికాహార వినియోగం చాలా అవసరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎన్.పి. స్వరూప తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పీలేరు సెక్టార్ పరిధిలోని వేపులబైలు పంచాయితీ, బండమీద హరిజనవాడ అంగన్ వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యవేక్షకురాలు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులకు 1000 రోజులు ప్రాముఖ్యత, పౌష్టికాహారం, రక్తహీనత సమస్యలను ఎలాఅధికమించడంపై అవగాహన కల్పించారు. పిల్లలకు వివాహ వయస్సు రాకముందే బాల్య వివాహాలు చేయడం వల్ల వారు ఎదుర్కొనే శారీరక, మానసిక, ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ రేగళ్ల ప్రాంత పర్యవేక్షకురాలు పి. స్వర్ణ, ఎంఎల్‌హెచ్‌పి నందిని, ఉఎన్ఎం అనసూయమ్మ, జంగంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ రెడ్డి, బిపిసి ఆనంద, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్త కె. చిన్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్‌గా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-బి.కొత్తకోట : బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్‌గా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కడపలో విధులు నిర్వహించే వారని, ఆయనను అక్కడ నుంచి ఇక్కడికి బదిలీ చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న పార్థసారథి కలికిరికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో తాను బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. మండలంలో రిజిస్ట్రేషన్లు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. డాక్యుమెంట్ రైటర్లు శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పక్కా గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ తెలిపారు. మండలంలోని దండువారిపల్లె, కొండయ్యగారిపల్లె హౌసింగ్ లేఅవుట్ లను స్థానిక ఎంపిడిఒ రమేష్ బాబు, సర్పంచ్‌లు పాపులమ్మ మల్లప్ప, వరలక్ష్మి శశిధర్ రెడ్డి, హౌసింగ్ ఎఇ అమర్నాథ్, ప్రభుత్వ అధికారులతో కలసి సందర్శించారు. 'మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమం ద్వారా గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పరిపాలనలో జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో లబ్ధిదారు లకు ఇచ్చిన గృహ నిర్మాణాలను 2024 డిసెంబర్ నెల నాటికి పూర్తి చేసి, గృహప్రవేశాలను చేపట్టాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం పక్కా గృహాలను మంజూరు చేసిందని, వాటిని లబ్ధిదారులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో విద్యుత్ సదు పాయం,తాగునీటి సదుపాయం అందుబాటులో లేకపోవడంతో నిర్మాణాలను పూర్తి చేయలేకపోతున్నామని, విద్యుత్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని హౌసింగ్ అధికారులకు, విద్యుత్ శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు దండువారిపల్లె లేఅవుట్ లోని లబ్ధిదారులు పలుమార్లు విన్నవించుకున్నా ప్రయోజనం కలగలేదన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంలో ఇనుమును కతరించుకోవడానికి విద్యుత్ అవసరం అవుతుందని, తమకు విద్యుత్ సదుపాయాన్ని, తాగునీటి సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తే నిర్మాణాలను పూర్తి చేయటానికి వీలవుతుందని వివరించారు. హౌసింగ్ లేఅవుట్ లో మౌలిక వసతులు లేవని లబ్ధిదారులు వాపోయారు. సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప స్పందిస్తూ వెంటనే తాగునీటి పైపులైను ఏర్పాటు చేయిస్తామని, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసు కురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసిన లబ్ధిదారులు గృహప్రవేశాలను చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఒ రమేష్, పిఆర్ ఇన్‌ఛార్జి ఎఇ బాలే తిరుమలేష్, వర్క్ ఇన్స్‌పెక్టర్ అనూష, రవికుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పురుషోత్తం, అశ్విని, వరప్రసాద్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పద్మావతి, లబ్ధిదారులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** గృహనిర్మాణ పథకంలో భాగంగా ఇళు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ళ నిర్మాణాలను పూర్తిచేయాలని అధికారులు సూచించారు. పిటిఎం మండల కేంద్రంలోని లేఅవుట్‌లో మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీరాములు నాయక్, పంచాయతీ విస్తరణాధికారి యోగానంద,ఉపాధి హామీ అదనపు ప్రోగ్రాం అధికారి మరియు లేఅవుట్ అధికారి తిరుపాల్,హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసులు,పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు కొంతమేర నిర్మాణాలు చేసి వదిలేశారని, అటువంటి వారి సకాలంలో పూర్తి చేసి సొంతింటి కలలను సహకారం చేసుకోవాలన్నారు.ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారులను సంప్రదించాలని వారు సూచించారు. **కలికిరి:** వివిధ దశల్లో పెండింగ్లో ఉన్న గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వెంటనే పూర్తి చేయాలని ఎంపిడిఒ గంగయ్య సూచించారు. శనివారం స్థానిక రెడ్డివారిపల్లి పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 -2024 మధ్య కాలం లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇల్లు మంజూరు కాబడిన లబ్ధిదారులు వివిధ నిర్మాణ దశలో ఉన్న వీళ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఒగురు మోహన్ సర్పంచ్ ఎల్లయ్య, ఎఇ హౌసింగ్ వెంకటేష్, ఎఇపిఆర్ అబేద్ హుస్సేన్ లేఅవ్ట్‌స్పెషల్ ఆఫీసర్ రామ్ చరణ్ పాల్గొన్నారు. **చిట్వేలి:** చిట్వేలి దళితవాడ, అరుంధతివాడలలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మోహన్, మండల స్పెషల్ ఆఫీసర్ రూపేష్ కుమార్‌రాజు, హౌసింగ్ ఎఇ సుధాకర్ అధ్యక్షతన లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ నిర్మాణం పూర్తిస్థాయిలో త్వరితగతిన వచ్చే 2025 సంవత్సరం మార్చి నెల లోపల పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ జగదీష్, సచివాలయ హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



నిమ్మనపల్లి:విద్యుత్, నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్న లబ్ధిదారులు

రేబిస్ వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ఎర్రకోటపల్లి జడ్‌పిహైస్కూల్‌లో విద్యార్థులకు రేబిస్ వ్యాధిపై డాక్టర్ కిషోర్ కుమార్‌రెడ్డి, ఎంపిహెచ్‌ఇఒ జయరామయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం సెప్టెంబర్28న ప్రపంచ రేబిస్ దినోత్సవం జరుపుకుంటామని, లూయిపాశ్చర్ అనే శాస్త్రవేత్త రేబిస్ వ్యాధికి వ్యాక్సిన్‌ను తయారు చేసి అమల్లోకి తెచ్చారని అన్నారు. లూయిస్ పాశ్చర్ జ్ఞాపకర్థంగా ఆయన మరణించిన రోజైన సెప్టెంబరు 28న ప్రతి సంవత్సరం ప్రపంచ రేబీస్ దినోత్సవం జరుపుకుంటామని అన్నారు. లూయిస్ పాశ్చర్ తన స్నేహితుల సహకారంతో, మొదటి సమర్థవంతమైన రేబిస్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారని తెలిపారు. మనుషులు, జంతువులపై రేబిస్ ప్రభావం గురించి అవగాహన పెంచడం, రేబీస్ వ్యాధి నివారణ చర్యలు చేపట్టడం ఈ ప్రపంచ రెబిస్ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. లిసా అనే వైరస్ వల్ల రేబిస్ వ్యాధి వస్తుంది. ఈ వైరస్ కలిగిన కుక్కలు,పిల్లులు,తోడేళ్ళు,నక్కలు,పెద్ద పిచ్చుకలు, ఉడుములు, ముంగిసలు, గబ్బిలాలు కోతులు, ఎలుకలు వంటి వాటిల్లో వైరస్ లు ఉండి ఈ జంతువులు మనల్ని కరచినపుడు ఈ లిసా వైరస్ లు మన శరీరంలోకి చేరి నాడి వ్యవస్థ లోకి ప్రవేశించి వ్యాధి లక్షణాలు కలగ చేస్తాయని అన్నారు.జ్వరం, తలనొప్పి, వికారం, వాంతులు, నీరసం,వ్యాధి ముదిరిన స్థాయిలో నీటిని చూస్తే కూడా రోగి భయపడతారు, గొంతు నుండి మాట రాక పోవడం, భ్రాంతులకు గురి కావడం, మూర్ఛ రావడం, లైట్లు, శబ్దాలు, స్పర్శకు భయపడటం జరుగుతుందని అన్నారు. .సరైన సమయంలో చికిత్స తీసుకోక, టీకాలు వేసుకోకపోతే మరణించే ప్రమాదం ఉందని అన్నారు. కుక్క కరచిన వెంటనే గాయాన్ని సబ్బు నీటితో బాగా 15 నిమిషాల పాటు కడగాలని సూచించారు.వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి డాక్టర్ సలహా మేరకు ఎఆర్‌వి టీకాలు వేయించుకోవాలని అన్నారు. పెంపుడు కుక్కలకు, పశువుల ఆస్పత్రిలో వైద్యులు సూచించిన మేరకు టీకాలు వేయించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి నినాదాలు చేస్తూ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ సుబ్బరత్న ,ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, బండిరెడ్డెమ్మ , ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. **సుండుపల్లి:** ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా రేబిస్ వ్యాధిపై రాయవరం గ్రామం లోని జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షరీఫ్, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శ్వేత, వైద్య సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం అమృ నాయక్ పాల్గొన్నారు. **కంభం వారిపల్లి:** రేబిస్ వ్యాధిపై స్థానిక వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుక్క కాటు, పిచ్చి కుక్క కరిచినపుడు దాని లాలాజలంలో ఉండే రేబిస్ వైరస్ మానవ శరీరంలోకి ప్రవేశిస్తాయని అన్నారు. రేబిస్ ప్రాణంతకం అయినప్పటికీ సకాలంలో టీకా ద్వారా నివారించుకోవచ్చని అన్నారు. కుక్కకాటును నిర్లక్ష్యం చేయకుండా చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమం పిహెచ్‌ఎన్ లలిత, పంచాయతీ సిబ్బంది, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కళాశాల పీడీ పి.నీలకంఠేశ్వరరావు తెలిపారు. ఎస్‌జిఎఫ్ అండర్-19లో ఇంటర్మీయట్ విద్యార్థులు ఇ.రోహిత్, సాఫ్ట్ బాల్ విభాగంలో మధులత, మేరీ, హర్షిత, పదవ తరగతి విద్యార్థి భరత్, 9వ తరగతి విద్యార్థి రిషిత్‌శర్మలు బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. క్రికెట్ ఫోటీల్లో సంధ్య, మమత రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. రైల్వేకోడూరులో జరిగిన తేక్వాండో పోటీల్లో ఇంటర్ విద్యార్థులు రోహిత్, భార్గవి పదవ తరగతి విద్యార్థి ఎస్. లహరి, ఎల్. తేజస్వి అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఇఒలు చక్రధరరాజు,నాగా తిరుమలరావు, ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, ఉపాధ్యాయులు అభినందించారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేటలో 9వ తరగతి చదువుతున్న హర్ష అనే విద్యార్థి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున తెలిపారు. అండర్-19 క్రికెట్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, పోటీలలో జిల్లాస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పీడీ పిడి బాల శేఖర్ తెలియజేశారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించండి :డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-కలికిరి: హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డిఎం హెచ్‌ఒ కొండయ్య వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం ఆయన పల్లవోలు కస్పాలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ వైద్యులు చిన్నరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 104 కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. హై రిస్క్ గర్భిణీలను గుర్తించి వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు సదుపాయాలు కల్పించాలని సిహెచ్‌ఒ, ఎఎన్ఎం కుఆదేశించారు. అంగన్వాడీకి కేంద్రంలో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని అంగన్వాడీ కార్యకర్తకు ఆదేహించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ, ఎంఎల్‌హెచ్‌పి నాగవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు డిజిటల్ వేయింగ్ స్కేల్స్ వితరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట : పిటిఎం మండలం బూర్లపల్లి సెక్టార్ -1 పరిధిలోని 26 అంగన్వాడీ కేంద్రాలకు డిజిటల్ వెహింగ్ స్కేళ్లను యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వితరణ చేసింది.బూర్లపల్లి ప్రధానోపాధ్యాలు పి.బాల సంజీవ,ఎంఇఒ-2 గౌస్ పీర్ ఉపాధ్యాయులు రెడ్డెప్పల సమక్షంలో సిడిపిఒ భాగ్యమ్మ, సూపర్ వైజర్ మునిరత్నమ్మ, అంగన్వాడీ సిబ్బందికి యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ అధ్యక్షులు రాజశేఖర్, భాస్కర్, అనిల్, మనోజ్, వెంకీ, మున్నాలు ఈ స్కేళ్లను అందించారు. అంగన్వాడీ కేంద్రాలకు వేయింగ్ స్కేల్స్ అందించడం పట్ల సిడిపిఒ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశాన వాటిక ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గాలివీడు : మండలకేంద్రంలోని నాయునివారిపల్లె వద్ద స్మశానవాటిక ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని శనివారం గ్రామస్థులు డిప్యూటీ తాసీల్దార్ తిమ్మారెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 798 ప్రక్కన ఉన్న శ్మశాన వాటిక,దేవాలయం భూమిని సదరు సర్వే నంబర్ గల యజమాని యంత్రాలతో చదును చేయించి ఆక్రమించుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు ఆక్రమణ స్థలాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు రవీంద్రనాయుడు, రాంబాబునాయుడు, ప్రతాప్‌నాయుడు, శ్రీనువాసులు నాయుడు, నరేష్ నాయుడు, గణేష్ నాయుడు, ఈశ్వర్ నాయుడు, కిషోర్ నాయుడు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రామసముద్రం

మండలపరిధిలోని చెంబకూరు కేంద్రంలో శనివారం యస్వంత్ డెంటల్ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలోఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 20 మంది దంత చికిత్సలకు ఎంపికైనట్లు దంత వైద్య నిపుణులు డాక్టర్ యస్వంత్ తెలిపారు. ఎంపికైన వీరందరికి అక్టోబర్ మొదటి వారంలో మదనపల్లి యస్వంత్ డెంటల్ కేర్ ఆసుపత్రిలో ఉచిత చికిత్సలు నిర్వహించబడునని తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, సుబ్రమణ్యం, ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది'

ప్రజాశక్తి - నందలూరు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని మారెమ్మ దేవాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. తొందరలోనే ప్రజలు ఈ ప్రభుత్వానికి స్వస్తి చెబుతారని ఆయన అన్నారు. మాజీ టిటిడి ఛైర్మన్లు వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, సిబిఐ ఎంక్వైరీ కోరుతున్నా సరే ఈ రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తుండడం సిగ్గుచేటని అన్నారు. తిరుమల దర్శనానికి వెళ్లడానికి డిక్లరేషన్ అడగడం ఈ ప్రభుత్వం వందరోజుల పరిపాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికేనని అన్నారు.రాష్ట్రంలో ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, హింసకాండలు జరుగుతూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాజంపేట జడ్‌పిటిసి దాసరి పెంచలయ్య, రాజంపేట వ్యవసాయ మార్కెట్ మాజీ ఛైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్, వైసిపి నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, సిద్ధవరం గోపిరెడ్డి, అరిగెల సౌమిత్రి, గీతాల నరసింహారెడ్డి, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, హస్తవరం సుబ్బరామిరెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : ఎస్‌ఎఫ్ఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

భగత్ సింగ్ ఆశయాలు సాధిస్తామని ఎస్‌ఎఫ్ఐ పట్టణ నాయకులు గురునాథ్ అన్నారు. శనివారం పట్టణంలో భగత్ సింగ్ 117 వ జయంతి సందర్భంగా ప్రభుత్వ బాలికల కళాశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ శంకరయ్య మాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్ననాటి నుండే బ్రిటిష్ వారు చేసే పనుల విధానాలను చూసి బ్రిటిష్ ప్రభుత్వంపై అవగాహన చేసుకుని నా దేశ ప్రజల కష్టజీతం సంపద శిస్తు పేరుతో దోచుకోవడం కనీసం ఒక్కరు ఇద్దరూ మాట్లాడకుండా చేసిన నా ప్రజలకు స్వేచ్ఛ కావాలి తన జీవితం తనే జీవించుకోవాలి అనే లక్ష్య తో బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన భారతదేశ ఐకాన్ భగత్‌సింగ్ అని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్‌ఎఫ్ఐ నాయకులు సతీష్, చందు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో భగత్ సింగ్ యువ ప్రాయంలో చూపిన తెగువ నేటి యువతకు స్ఫూర్తి గా నిలుస్తోందని ఐటియుసి నాయకులు జి.కృష్ణమూర్తి పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్‌ఆర్ కాలనీలో భగత్ సింగ్ యువత ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఐటియుసి నాయకులు కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ త్యాగం మాత్రమే మనల్ని అణచివేత నుంచి రక్షిస్తుందని భగత్ సింగ్ నిరూపించిన ధీరుడని కొనియాడారు. కార్యక్రమలో భగత్ సింగ్ యువత మురళి, కిరణ్ కుమార్, హరీష్, కౌశిక్, మాధవ, శ్రీ హరి తధితరులు పాల్గొనారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులరమణ మాట్లాడుతూ భగత్ సింగ్ మన స్వాతంత్ర ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారని,విప్లవం వర్ధిల్లాలి అనే నినాదంతో ఎందరో యువకులను స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనేలా చేసారన్నారు.



రాయచోటి : భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చెర్లోపల్లిలో వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ నిలిపివేత

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో వాటర్‌ప్లాంట్‌కు శనివారం విద్యుత్‌శాఖ అధికారి చలపతి ఆదేశాల మేరకు చెర్లోపల్లి గ్రామ విద్యుత్ అధికారి విద్యుత్‌ను నిలిపి వేశారు. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో గ్రామంలో నీటిలో క్లోరైడ్ అధిక శాతం ఉన్నందున అధికారులు, నాయకులు ఎంపీ సిఎం.రమేష్ దృష్టికి తీసుకువెళ్లి వారి నిధులతో ఈ ప్లాంట్‌ను మంజూరు చేయించి నిర్మించారు. అప్పటినుండి కొనసాగుతూ ఉంది. తిరిగి ఈ ప్లాంట్ ను మూడు నెలల క్రితం కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పున: ప్రారంభించగా, నాయకులు గ్రామానికి ఉచితంగా తాగునీటిని అందిస్తామని చెప్పారు. ఈ విషయమై స్థానిక విద్యుత్ శాఖ ఎఇ చలపతిని వివరణ అడుగగా గత మూడు నెలలుగా వాటర్ ప్లాంట్ కు విద్యుత్ బిల్లు చెల్లించడంలేదని, పై అధికారులు ఒత్తిడితో తొలగించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రతి నెలా ప్రభుత్వ వైద్య అధికారుల చేత విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ మొహమ్మద్ ఎస్తాని తెలిపారు.శనివారం పిటిఎం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనను, పరిసరాల పరిశుభ్రత, భోజనం నాణ్యతలను ఎంపిడిఒ బాలాజీ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీమతి ఎస్.శివ కుమారి అధ్యాపక బృందం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రాష్ట్ర అభివృద్ధిలోప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఇఒ నారాయణ అన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిని ఆకాంక్షిస్తూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడానికి స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా పెట్టుకుని కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లోని విద్యార్థులకు క్లస్టర్ స్థాయి ల్లో వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో విజేతలగా నిలిచిన విద్యార్థులకు ఎంఆర్‌సి భవనంలో మండల స్థాయిలో స్వర్ణాంధ్ర-2047 పై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. వ్యాసరచన పోటీలలో జడ్‌పి హైస్కూల్ (తెలుగు)కు చెందిన విద్యార్థిని డి.చరిత మొదటి స్థానంలో నిలవగా, ఎస్.వరుణ్‌కుమార్(రెడ్డివారిపల్లె), కే.మేఘన (బాలినాయనపల్లె) హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. ఉపన్యాస పోటీలలో ఎంపియుపి స్కూల్ బండ్లపైకి చెందిన కెంఎం.సంధ్య మొదటి స్థానంలో నిలవగా, ఎన్.భవిత (నిమ్మనపల్లె), ఎం.కిరణ్ తేజ (రెడ్డివారిపల్లె) హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు.ఎంఇఒ నారాయణ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని సి.పొలిమేరపల్లి గ్రామంలో గత కొంత కాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల తాగు నీటి సమస్యను రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిదృష్టికి తీసుక పోయినట్లు గ్రామస్తులు తెలిపారు. వెంటనే స్పందించిన మంత్రి ప్రత్యేక నిధులుతో పొలిమేరపల్లెలో బోరు వేయించారని తెలిపారు. టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి బోరు పాయింట్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజ కవర్గంలో మొదటి విడత నీటి సమస్య అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి ఆ గ్రామాలకు మంత్రి చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా బోర్లు వేయించి నీటి ఎద్దడిని పరిష్కరిస్తామని చెప్పారు.

వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ మహబూబ్‌నగర్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సద్దాం హుస్సేన్ తెలిపారు. గతంలో వేసిన విధిదీపాలు మరమ్మతుకు గురి కావడంతో ఆ ప్రాంతంలో వేరే వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. యానాదుల కాలనీలో వీధి దీపాలను ఏర్పాటు చేసి వారికి రాత్రుల్లో పాములు, తేళ్ల బెడద నుంచి రక్షణ కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ జవాద్ ప్యారిజాన్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

గంజాయి స్మగ్లర్ అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గంజాయిని స్మగ్లింగ్ చేస్తూ రెండు నెలలుగా పోలీసులకు దొరకకుండా తిరుగుతున్న గంజాయి స్మగ్లర్‌ను శనివారం ముదివేడు పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి అరకిలో గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. శనివారం మదనపల్లె రూరల్ పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పి కొండయ్య నాయుడు సమక్షంలో నిందితున్ని అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలకడ మండలం బంగారువాండ్ల పల్లెకు చెందిన పఠాన్‌గని సాబ్ కుమారుడు పఠాన్ మౌలాలి గత ఆరు నెలలుగా గంజాయిని స్మగ్లింగ్ చేస్తూ పలువురికి గంజాయిని విక్రయిస్తున్నాడని తెలిపారు. ఒరిస్సా బోర్డర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి విశాఖపట్నం నుంచి రైలు మార్గం గుండా కలకడకు చేరుకొని యువతను ఆకర్షించేవాడని అన్నారు. ముఖ్యంగా కళాశాలలు, పెట్టి బంకులు, పీజీ హాస్టల్ వద్ద మకాం వేసి గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని యువత కు విక్రయించి సొమ్ము చేసుకునేవాడని అన్నారు. ఈ క్రమంలో నెలరోజుల క్రితం మదనపల్లి మండలం గొల్లపల్లి పంచాయతీలో 14 మంది యువకులు గంజాయి సేవిస్తూ పట్టుపడ్డారని అన్నారు. వారిని అరెస్టు చేసిన పోలీసులకు తాము మౌలాలి నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారని అన్నారు. నాలుగు రోజుల క్రితం ముదివేడు పోలీసు స్టేషన్ పరిధిలో కురబలకోట రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద 14 మంది గంజాయి సేవిస్తూ పట్టుపడ్డారని అన్నారు. వారు సైతం పఠాన్ మౌలాలినే తమకు గంజాయి సరఫరా చేసినట్లు వెల్లడించారని అన్నారు. పోలీసులు అప్రమత్తమై ప్రధాన నిందితుని కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు. తంబళ్లపల్లి మండలం, రేణుమాకులపల్లి పంచాయతీ జోగోనుబురుజు వద్ద గంజాయి స్మగ్లర్ పఠాన్ మౌలాలి వెళుతుండగా పక్క సమాచారంతో ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ సిబ్బందితో దాడి చేసి నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడని చెప్పారు. నిందితునిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు డిఎస్‌పి పేర్కొన్నారు. గంజాయిని ఎవరైనా విక్రయించినా, సరఫరా చేసిన, వినియోగించిన చట్టరీత్యా నేరమన్నారు. గంజాయికి యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటుసారా విక్రయస్థావరం పై శనివారం స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదుచేసి, రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. శనివారం మధ్యాహ్నం రెడ్డివారిపల్లె పంచాయతీ ఎద్దులవారి పల్లె సమీపంలో కప్పలమడుగు చంద్ర నాటుసారా తీసుకొచ్చి విక్రయిస్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించి అతనిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నాటు సారా విక్రయిస్తూ పట్టుబడ్డ వ్యక్తి పై కేసు నమోదు చేసి, రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.